పడేస్తుంది. నువ్వు మునిగిపోతావని భయం లేదు. ఈదే వాడికి భయం. నీ ప్రయత్నం ఏమీ అక్కరలేదు. నీకు హోలీకంపెనీ దొరికితే నువ్వు చేసే సాధనలు ఏపాటివి? నిన్ను అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, చీకటిలోనుండి వెలుతురులోనికి హోలీ కంపెనీయే నిన్ను తీసుకువెళ్ళి పడేస్తుంది. గురువు ప్రేమకు హద్దులు ఉండవు, పరిమితులు ఉండవు. ఆ దయాసాగరం దగ్గరకు వెళ్ళి మనం జుర్రుకోవటమే. మీ మైండు ఓపెన్ అయి ఉంటే, మీ హార్ట్ ఓపెన్ అయి ఉంటే మీకు సత్‌పురుషులయొక్క వైభవం తెలుస్తుంది. మైండ్ క్లోజ్ చేసుకుని, హార్టు క్లోజ్ చేసుకుని సత్‌పురుషుడి దగ్గర ఉన్నా వాడి ప్రభావం నీకేమీ పడదు.

మీరు సద్వస్తువు కోసం వెతుక్కుంటున్నారు కాని అది మీకు దొరకటంలేదు. చీకటిలో వస్తువు ఉంటుంది గాని అక్కడ లైటు లేకపోతే అది మనకు కనబడదు. అలాగే మీ హృదయంలో సద్వస్తువు ఉన్నా జ్ఞాని దయలేకపోతే అది కనబడదు. మీకు మీ హృదయంలో ఉన్నది ఏదో తెలుస్తూ ఉంటే దాని సుఖం మీకు అందుతుంది కాని, మీ హృదయంలో సద్వస్తువు ఉన్నా అది తెలియకపోతే దాని సుఖం మీకు అందదు. సద్వస్తువు అనుభవంలో ఉన్నవారు ఎవరైనా తటస్థపడితే వాళ్ళతోటి సహవాసం చెయ్యండి. జ్ఞాని సమక్షంలో నీకు తెలియకుండా బాహ్యముఖానికి అలవాటు పడిన మనస్సుకి అంతర్‌దృష్టి కలుగుతుంది. ఎక్కడైతే ట్రూత్ ఉందో ఆ ట్రూత్ వైపుకి మనస్సు ఉపసంహరించుకుంటుంది. సత్యం వైపు నీ మనస్సు ఎప్పుడైతే జరుగుతుందో, అలా జరిగి సత్యములో ఐక్యం అయిపోయిందో అప్పుడు నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు తానుగా వ్యక్తమవుతుంది. అది నీ కడసారి జన్మ. అప్పుడు నువ్వు ఇంక శవాలని మొయ్యనక్కరలేదు. నా జీవితంలో మొదటి సెయింట్‌ని 1954లో స్వామి శివానందని చూసాను. ఆయనని చూడటానికి వెళ్ళిన భక్తులలో నేను చిన్నపిల్లవాడిని. స్వామి నన్ను దగ్గరకు పిలచారు. పిలిచి నా వీపు మీద తట్టి బి గుడ్ అండ్ డు గుడ్ అన్నారు. మంచి చేస్తూ ఉండు, మంచిగా ఉండు అని చెప్పి మంచి చెయ్యటం కంటే మంచిగా ఉండటం కష్టం, మంచిగా జీవించటం కష్టం, మంచితనమే జ్ఞానం కింద మారిపోతుంది అని శివానంద చెప్పారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-12-2010, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు గీతాజయంతి. ఈరోజున కురుక్షేత్రంలో భగవంతుడి చేత అర్జునుడికి ఉపదేశింపబడినదే భగవద్గీత. ఉత్తరద్వారం మోక్ష ద్వారం అని ఈ రోజున ఉత్తరద్వారం ద్వారా గుడిలోకి వెళ్ళి విష్ణువుని దర్శనం చేసుకుంటారు. శివరాత్రి, ముక్కోటి ఏకాదశి ఈ రెండు రోజులు భక్తులు తప్పనిసరిగా ఉపవాసం ఉంటారు. ఉపవాసం అంటే మనం నిరాహారంగా ఉండటం అని ఒక అర్థం. నీలో ఉన్న పరమాత్మకి దగ్గరగా నివసించమని ఒక అర్థం. ఉపవాసం రోజున ఏదైనా కొద్దిగా తిన్నా హృదయంలో ఉన్న నారాయణుడికి

సమీపంలో ఉండటం నేర్చుకోమని చెప్పారు.

సర్వసాధారణంగా వేదాంతం చెట్లకింద కూర్చుని ఆశ్రమాలలో చెబుతారు. చాలా క్వయిట్‌గా కూల్‌గా ఉండాలి. ఏమూల నుంచి డిస్ట్రబెన్స్ వచ్చినా ఆ స్పీకరు ఉద్రేకపడతాడు, కాని భగవంతుడికి ఉద్రేకం ఏమిటి? ఆయన యుద్ధభూమిలో చాలా కామ్‌గా చెప్పాడు. చాలా క్వయిట్‌గా చెప్పాడు. తరువాత శ్లోకబద్ధం చేసింది వ్యాసుడు. పరమాత్మ భగవద్గీత చెబుతూ ఉంటే అర్జునుడు ఒక్కడే వినలేదు సంజయుడి ద్వారా ధృతరాష్ట్రుడు కూడా విన్నాడు. ధృతరాష్ట్రుడు విన్నా వాడికి లోపల కపటం ఉండటం వలన అది వాడి మెదడుకి పట్టలేదు. అర్జునుడు అంటే తెల్లటివాడు, స్వచ్ఛమైనవాడు. అర్జునుడు తపస్సు చేసాడు, క్రమశిక్షణ ఉంది. నియమంగా జీవించేవాడికి క్రమశిక్షణ వస్తుంది కాని, నియమంగా జీవించకపోతే మనకి క్రమశిక్షణ రమ్మన్నారాదు. మనం ఈ లోకంలో అభివృద్ధిలోనికి రావాలన్నా, ఉత్తమ లోకాలకి వెళ్ళాలన్నా ముందు క్రమశిక్షణ ఉండాలి. క్రమశిక్షణ లేకపోతే ఈ లోకంలోనే పతనం అయిపోతాము, మంచిలోకాలకి ప్రయాణం చేయలేము. ఒకో మనిషి ఎంజాయ్ మెంటుకోసం కృషిచేస్తాడు. భోగం ఒక్కటే కోరుకుంటాడు అది ప్రేయస్సు. కొంతమంది భోగానికి ఇంపార్టెన్సు ఇవ్వరు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలి, అంతర్యామిని దర్శనం చేసుకోవాలి అని ఒకోమనిషి పెర్‌ఫెక్షన్ కోసం కృషి చేస్తాడు అది శ్రేయస్సు. అర్జునుడికి పెర్‌ఫెక్షన్ కావాలి, ధృతరాష్ట్రుడికి ఎంజాయ్‌మెంటు కావాలి. ఇద్దరూ పరమాత్మ బోధ విన్నారు. వినటంలో తేడా ఉంది. భగవద్గీత చెప్పేవాడికి ఎంతోకొంత తపస్సు ఉండాలి, భక్తుడు అయి ఉండాలి. భగవద్గీత వినేవాళ్ళకి కూడా తపస్సు ఉండాలి. తపస్సు అంటే ఈశ్వరసాక్షాత్కారం కోసం నువ్వు చేసే ప్రయత్నం. తపని తిరగేస్తే పత అవుతుంది. అంటే తపస్సు లేనివాడు, ఎవడైతే ట్రూత్‌ని రీలైజ్ చేయటానికి ప్రయత్నం చెయ్యడో వాడు తప్పనిసరిగా పతనం అయితీరతాడు. ప్రపంచంలో ఒక్క భగవద్గీతకే జయంతి చేస్తారు. మిగతా ఏ గ్రంధాలకీ జయంతి చేయరు. గీత అంటే కేవలం వన్‌వే ట్రాఫిక్‌గా ఉండదు. నిన్ను ఎన్ని రకాలుగా డెస్టినేషన్‌కి తీసుకువెళ్ళాలో అన్ని రకాలుగా పరమాత్మ ప్రయత్నం చేస్తాడు.

సోమరితనం ఉన్నవాడికి లోపలి పైసాలు ఉండవు, బయట పైసాలు ఉండవు. మీకు ఎంజాయ్‌మెంటు కావాలి అంటే బయట పైసాలు సంపాదించుకోండి, శరీరం మెయిన్‌టైన్ అవ్వాలన్నా బయట పైసాలు అవసరం. లోపల పైసాలు అంటే దైవీగుణాలు. దైవీ గుణాలని కష్టపడి సంపాదించుకోవాలి. ఆ దైవీగుణాలు సంపాదించుకుంటే దేవుడి కృపని మనం కోరనక్కరలేదు. ఆయన దయ మన నెత్తిమీద వర్షం కురిసినట్లు కురుస్తుంది. లోపల పైసాల వల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి వలన జ్ఞానం వస్తుంది, జ్ఞానం వలన మోక్షం వస్తుంది. దైవీగుణాలు లేనివాడికి బయట పైసాలు వలన చిత్తశుద్ధి రాదు. ధృతరాష్ట్రుడు భగవద్గీత విన్నాడు. ధృతరాష్ట్రుడికి చిత్తశుద్ధి లేక భగవద్గీత ఆయన హృదయానికి పట్టలేదు. అర్జునుడూ

భగవద్గీత విన్నాడు. అర్జునుడికి చిత్తశుద్ధి ఉంది. అందుచేత భగవద్గీత వాడి హృదయానికి పట్టింది. గీత చెప్పేవాడికి చిత్తశుద్ధి లేనప్పుడు, వినేవాడికి చిత్తశుద్ధి లేనప్పుడు వాళ్లకి గీత ఏమిటి? అని రామకృష్ణుడు అన్నాడు. మీకు ఎంతోకొంత త్యాగబుద్ధి లేకపోతే, ఎన్ని లక్షలసార్లు మీరు గీతను అధ్యయనం చేసినా మీకు అది అంటదు అని చెప్పాడు. అందరూ గీత చదవటం మంచిదే. గీత చదవటం వలన వెంటనే మీకు జ్ఞానం రాకపోయినా ఎంతోకొంత పుణ్యం వస్తుంది అన్నారు. మనం తిన్న ఆహారంలో నుండి స్థూలభాగం శరీరం కింద తయారవుతుంది. సూక్ష్మభాగం మైండుకింద తయారవుతుంది. అందుచేత మీరు సాత్వికాహారం తినండి. ఎక్కువ పులుపు కాకుండా, ఎక్కువ కారం కాకుండా తేలికగా జీర్ణం అయ్యేలాగ తినండి. ఆహారవిషయంలో మీరు జాగ్రత్తగా ఉంటే, మీకు ఉన్న కంట్రోలే మీకు లోపల ఉన్న పైసాలు పెంచుతుంది. మాటల్లో నియమబద్ధంగా మాట్లాడే వాడే పని ఎక్కువ చేస్తాడు. అతిగా మాట్లాడేవాడు పని తక్కువే చేస్తాడు. అతిగా భోజనం చేయటం, అతిగా నిద్రపోవటం, అక్కడ మాటలు ఇక్కడ, ఇక్కడ మాటలు అక్కడ చెప్పటం, ఒకమాట అంటే ఇంకో నాలుగు మాటలు కల్పించి చెప్పటం ఇవన్నీ వ్యసనాలు. నువ్వు డబ్బు అవసరం అయినచోట ఖర్చు పెట్టవచ్చు. అవసరం లేకుండా దుబారాగా ఖర్చుపెడుతున్నావు అనుకో నీకు వ్యసనం ఉందని శాస్త్రంలో చెప్పాడు. దుబారాగా డబ్బు ఖర్చు పెట్టేవాడికి క్రమశిక్షణ పోతుంది.

అపాత్రదానం, పాత్రదానం - నువ్వు ఎక్కడ అయితే డబ్బు ఇస్తున్నావో అక్కడ నీ డబ్బుకి న్యాయం జరిగితే దానిని పాత్రదానం అంటారు. నువ్వు ఇచ్చిన డబ్బు పట్టుకెళ్లి సారా తాగుతాడు అనుకోండి, లేకపోతే సిగరెట్ పెట్టి కొనుక్కొంటున్నారు అనుకోండి దానిని అపాత్రదానం అంటారు. అపాత్రదానం వలన నీకు పుణ్యం ఎలాగూ రాదు. డబ్బూ పోతుంది, చివరకు పాపం వస్తుంది. నీకు డిస్క్రిమినేషన్ లేకపోతే డబ్బు ఎక్కడ ఖర్చు పెట్టాలి, ఎక్కడ ఖర్చు పెట్టకూడదు అని నీకు తెలియదు. మీరు కష్టపడి సంపాదించుకున్న డబ్బు మీకు హేపీనెస్ ఇవ్వాలికాని, సారో ఇస్తే ఎలాగ? నీ డబ్బు నిన్ను సుఖపెట్టకపోతే ఆ డబ్బు నీకు ఎందుకు? అందుచేత మీరు డబ్బుని సద్వినియోగం చేస్తే అది మీకు ప్లెజర్‌ని తీసుకువస్తుంది. ఆ డబ్బే మీరు సద్వినియోగం చెయ్యకపోతే పెయిన్ తీసుకొని వస్తుంది. నువ్వు వంద రూపాయలు సంపాదిస్తూ ఉంటే 90 రూపాయలు నువ్వు ఉపయోగించుకున్నా, పది రూపాయలు నీవి కాదు అని నువ్వు సమాజ శ్రేయస్సుకి ఉపయోగించు. ఈశ్వరుడి పాదాల దగ్గర సమర్పించు. ఈ సృష్టి రూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. దరిద్రనారాయణుడికి అంటే వారు కూడా నారాయణ స్వరూపమే వారికోసం ఆ పది రూపాయలు ఉపయోగించు.

ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, మనకి కంట్రోలరు ఒకడు ఉన్నాడు అని నీకు సజీవమైన విశ్వాసం ఉండాలి. ఒకోసారి అనుకున్న పనులు అవుతాయి, ఒకోసారి అనుకున్న పనులు అవ్వవు. అనుకున్న పనులు అవుతూ ఉంటే అప్పుడు భగవంతుడు ఉన్నాడు

అనుకుంటాడు. అనుకున్న పనులు అవ్వకపోతే భగవంతుడు లేడు అనుకుంటాడు. వారు అల్ప విశ్వాసులు. అటువంటివారిని విశ్వాసహీనులు అని ఏసుక్రీస్తు అనేవాడు, విశ్వాస హీనులకి దేవుడు ఎలా రీలైజ్ అవుతాడు. మీకు ట్రూత్ రీలైజేషన్ లేకుండా ఫ్రీడం ఎలా వస్తుంది. నీకు ట్రూత్ రీలైజ్ చేయకుండా అది నీకు సాధ్యము కాదు. నీ విశ్వాసము లోతుగా ఉండాలి. నువ్వు అనుకున్న పనులు జరగకపోయినా నీ విశ్వాసము చలించకూడదు. నువ్వు సత్కర్మ నిష్కామంగా జన్మలతరబడి చేసుకుంటూ రాగా, రాగా అప్పడు నీకు మైండు ప్యూరిటీ వస్తుంది. 100% నీకు ప్యూరిటీ వస్తే ఆ ప్యూరిటీయే నీ లోపల ఉన్న ట్రూత్‌ని రీలైజ్ చేయటానికి ఫిట్ అవుతుంది. నీకు 100% ప్యూరిటీ వస్తే అప్పడు అది నేచురల్‌గా ట్రూత్‌తో లయమవుతుంది. లేకపోతే లయమయ్యే అవకాశం లేదు. నువ్వు సత్‌కర్మ నిష్కామంగా చెయ్యకుండా, చిత్తశుద్ధి లేకుండా, నీకు ఏకాగ్రత లేకుండా, తోటి మానవుల పట్ల ప్రేమ లేకుండా, నువ్వు నేను ఎవడను? నేను ఎవడను? అని ఏదో విచారణా మార్గం మొదలుపెడితే నువ్వు నూటికి నూరుపాళ్ళు సక్సెస్ అవ్వవు. నువ్వు సాధన చేసినా ఫెయిల్ అయిపోతావు. దేవుడు పాదాల దగ్గర నువ్వు పుష్పాలు పెడుతున్నావు కదా. అలాగ పనిద్వారా కూడా నువ్వు భగవంతుడిని ఆరాధించు. నువ్వు చేసే పని వర్షిప్ కింద చెయ్యి. అప్పడు ఆయన అనుగ్రహానికి పాత్రుడవుతావు.

భగవంతుడు ఎవడినైతే ఎన్నుకుంటాడో వాడికే తెలియబడతాడు. అందరికి తెలియబడడు అని ఒక ఉపనిషత్‌లో ఉంది. అయితే భగవంతుడికి పార్షియాలిటీ ఉన్నట్లు తెలుస్తోంది కదా అని అడిగారు. అంటే వారిది రాంగ్ అండర్‌స్టాండింగ్. గ్రేస్ అంతటా ఉంది. ఆ గ్రేస్‌ని ప్యూరిటీ లేనివాడు అందుకోలేడు. వర్షం కురుస్తూ ఉంటే ఒక బిందె పట్టుకెళ్ళి బోర్లా పెడితే ఎంత వర్షం కురిసినా బిందెలో నీళ్ళు పడవు. నీ మైండుని ఓపెన్ చేసి ఉంచాలి. ప్యూరిటీ ఉండాలి, నేర్చుకోవాలనే జిజ్ఞాస ఉండాలి. జిజ్ఞాస లేకుండా జ్ఞానం రాదు, ముముక్షుత్వం లేకుండా మోక్షం రాదు. జ్ఞానానికి పెట్టుబడి డబ్బుకాదు, తెలుసుకోవాలనే కాంక్షే పెట్టుబడి. ఎవడు డిజర్వు అయితే వాడికి నేను తెలియబడతాను అని చెప్పటంకోసం నేను ఎవడినైతే ఎన్నుకున్నానో వాడికి తెలియ బడతాను అని చెప్పాడు. మన శరీరం కంటే, మన మనస్సుకంటే, మన ఇంద్రియాలు కంటే నారాయణుడు మనకు సన్నిహితంగా ఉన్నాడు. వాడు మన ఆత్మగా ఉన్నాడు, మనకి సాక్షిగా ఉన్నాడు. అందుచేత నారాయణుడి యొక్క గ్రేస్ నువ్వు అందుకోవటానికి ఫిట్ అవ్వాలి. అంటే ఎవడైతే ఫిట్ అయ్యాడో వాడికి తెలియబడతాను అని చెప్పటానికి బదులు నేను ఎవడినైతే ఎన్నుకుంటానో వాడికి తెలియబడతాను అని చెప్పాడు. ఉపనిషత్తుల భాష ప్రాచీనమైనది. అది అర్థం చేసుకోవటంలో తేడా. భగవంతుడికి పార్షియాలిటీ ఉంటేవాడు భగవంతుడు ఎలా అవుతాడు. మీ అండర్‌స్టాండింగ్‌లో తేడా ఉంది కాని ఆయన చెప్పిన వాక్యంలో తేడా లేదు అని చెప్పారు.

మీరు ఎంతోకొంత సెల్ఫ్‌లెస్ వర్క్ చేయకుండా, మీతోటి మానవుడి శ్రేయస్సు మీరు

కోరకుండా, ప్రపంచానికి మీ కంట్రిబ్యూషన్ ఏమీ లేకుండా నేను ఆత్మజ్ఞానం సంపాదించేస్తాను, జ్ఞాననిష్టలో ఉంటాను అంటే అది సాధ్యము కాదు. రమణమహర్షిగారిలా మేము కూడా గోచీ పెట్టుకుని అలాగే ఉంటాము అంటే నీకు గోచీ మిగులుతుంది కాని జ్ఞానం రాదు. మీకు లోపల మెచ్యూరిటీ ఏమీ రాదు. మీ మనస్సు శుభ్రంగా ప్రాపంచిక భోగాలు అనుభవించి బలిసి ఉంది. మీ మైండు చిక్కిపోవాలి కదా! మీ మైండు చిక్కిపోకుండా నో మైండు స్టేట్‌కి ఎలా వస్తారు. నో మైండు స్టేట్‌కి వస్తేకాని ట్రూత్ రివీల్ అవ్వదు. మీ మైండుని దేనికి ఉపయోగిస్తున్నారు? ఇంద్రియాల ద్వారా విషయాలని అనుభవించటానికి ఉపయోగిస్తున్నారు. విషయాలు అనుభవించే కొలది అది చిక్కిపోతుంది అనుకుంటున్నారా, అది దున్నపోతులా బలుస్తుంది. దున్నపోతు లాంటి ఈ మైండా మీకు జ్ఞానం సంపాదించి పెట్టేది. మనస్సు చిక్కిపోవాలి. మనస్సు దైవచింతన చేస్తూ ఉంటే అది చింతించి, చింతించి మనస్సు పోయి అమనస్కస్థితి వస్తుంది. మీ మనస్సు ప్రపంచాన్ని ఎంజాయ్ చేసేకొలదీ తెగబలిసిపోతుంది. మీ మనస్సు మీ స్వరూపానికి దూరం అయిపోతుంది. మీ స్వరూపానికి దూరం అయిపోతే చనిపోయిన తరువాత మీకు మిగిలేది నరకం. కామ, క్రోధ, లోభం ఈ మూడు నరకానికి ద్వారాలు. ఇవి పెంచుకోకండి. ఇవి సాధ్యమైనంతవరకూ రెడ్యూస్ చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. అదే సాధన.

యోగయుక్తుడు అంటే నిష్కామ కర్మయోగి. అంటే కామం లేకుండా పనిచేసేవాడు, దైవాన్ని చింతించేవాడు చేతులతోటి పని చేస్తాడు, మనస్సుతోటి దైవాన్ని చింతిస్తాడు. ఈ రెండూ సైమల్‌టేనియస్‌గా చేసేవాడు శీఘ్రముగా బ్రహ్మస్వరూపమును పొందుతాడు. మనం అన్ని పనులూ చేస్తాము కాని మనల్ని మనం తెలుసుకోవటానికి మనకు టైము లేదు అంటాము. లోకసంగ్రహం కోసం బిజీగా ఉన్నావా? నీ స్వార్థాన్ని పెంచుకోవటానికి బిజీగా ఉన్నావా? నీ టైము అంతా దేనికి ఉపయోగిస్తున్నావు? నీ టైము అంతా బయట పైసాలకే ఉపయోగిస్తే మరి లోపలి పైసాలు నీకు అక్కరలేదా? బయట పైసాలు నీకు వల్లకాటి దాకా కూడా రావు. నీ పెట్టెలో ఉన్న డబ్బు పెట్టెలోనే ఉంటుంది. లోపలి పైసాలు మరణానంతర జీవితంలో నీకు వస్తాయి. లోపలి పైసలే అల్టిమేట్ ట్రూత్ కాదు కానీ అల్టిమేట్ ట్రూత్‌ని రీలైజ్ చేయటానికి అవి నీకు సహకరిస్తాయి. ఒక పని నువ్వు అందంగా, బాగా చేసావు అనుకో అది మంచిదే. ఆ పని నీకు అంటకుండా చెయ్యాలి అదీ యోగం. నువ్వు ఆ పని చేస్తూ ఉండాలి, ఎవరైనా మీరు ఈ పని గొప్పగా చేసారు అని అంటే నీకు గర్వం రాకూడదు. అక్కడ వ్యక్తి కనపడకూడదు. ఆ మాట అనకముందు ఎంత కామ్‌గా, క్వయిట్‌గా, కూల్‌గా ఉన్నావో ఆ మాట అన్న తరువాత కూడా అలాగే ఉండాలి. దాని ప్రభావం నీ మైండుమీద పడకూడదు. పడితే నీకు పొంగు వస్తుంది. నీకు తెలియకుండా నీకు గర్వం వస్తుంది. పని బాగా చెయ్యటం అంటే అక్కడ నేర్పేకాదు, ఆ ఫలితం నీకు అంటకుండా కూడా చెయ్యాలి.

ఫలితం అంటింది అనుకో మళ్ళీ రీబర్త్‌కి కారణం అవుతుంది. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా నడవాలో ఈ ఆధ్యాత్మిక జీవితంలో అంత జాగ్రత్తగా ఉంటే వాడు సక్సెస్ అవుతాడు. లేకపోతే వాడికి సక్సెస్ అయ్యే అవకాశం లేదు.

**విశుద్ధాత్మా** - నీ అంతఃకరణం పవిత్రంగా ఉండాలి. నీ బుద్ధి శాంతిగా ఉండాలి, నీ హృదయం నిర్మలంగా ఉండాలి. కొంతమంది హృదయంలో ఒకటి ఉంటుంది, ఆ హృదయంలో ఉన్నది నోటితో చెప్పరు, నోటితో చెప్పేది చేత్తోటి చేయరు. వాడిని కపటి అంటారు. పవిత్రమైన హృదయం ఉన్నవాడు ఎలా ఉంటాడు అంటే వాడి తలంపు, వాడి మాట, వాడి చేత ఒకటిగానే ఉంటాయి. విజితాత్మా అన్నింటికంటే మనోనిగ్రహం ముఖ్యం. నీవు ఆత్మజ్ఞానం సంపాదించాలని అనుకుంటే మైండు కంట్రోలు తప్పనిసరిగా అవసరం. జితేంద్రియః అంటే ఇంద్రియనిగ్రహం. కాళిదాసు ఏమని చెప్పాడు అంటే అందని ద్రాక్ష పళ్ళు పుల్లగా ఉంటాయి అవి నాకు అక్కరలేదు అంటావు. ఇది ఇంద్రియనిగ్రహం కాదు. మీ ఇంద్రియాలకి భోగ్యవస్తువులన్నీ అందుబాటులో ఉండాలి. ఏ ఇంద్రియానికీ చాపల్యం ఉండకూడదు. అదీ ఇంద్రియనిగ్రహం.

నువ్వు గ్రౌండు రియాలిటీస్‌కి దూరంగా ఉన్నావు. మనిషి ఎప్పుడూ గ్రౌండు రియాలిటీస్‌కి దూరంగా ఉండకూడదు. గ్రౌండు రియాలిటీస్‌కి ఎంతదూరంగా ఉంటే వాడు జీవితంలో అంత నష్టపోతాడు. జరిగిపోయిన గొడవలు ఎక్కువ తలపెట్టుకోకూడదు. భవిష్యత్తు గురించి ఎక్కువ గాలిలో మేడలు కట్టకూడదు. అది ఎలా జరగవలసి ఉందో అలా జరుగుతూ ఉంటుంది. నీ స్వరూపాన్ని నువ్వు రీలైజ్ చేయవు అనుకో నువ్వు చాలా నష్టపోతావు, భరించలేనంత నష్టపోతావు, మైండుని గాలికి విడిచిపెట్టేయకు. మైండుకి కంట్రోలు ముఖ్యం. నిన్ను అభివృద్ధిలోనికి తీసుకువచ్చేది, నిన్ను పాడుచేసేది కూడా నీ మైండే. నీ మైండుని నువ్వు బాగుచేసుకోవటం కంటే పెద్దపనులు ఏమైనా ఈ లోకంలో ఉన్నాయి అనుకుంటున్నావా? నువ్వు రిఫారమ్ అవ్వకుండా ఎవళ్ళని రిఫారమ్ చేస్తావు. ఎవళ్ళని మోసం చేస్తావు. ముందు నిన్ను నువ్వు రిఫారమ్ చేసుకోవాలి. నీకు ఆత్మ అనుభవంలోనికి వస్తే నీ వల్ల లోకానికి డైరెక్టుగానో, ఇండైరెక్టుగానో హెల్ప్ జరుగుతుంది. నీలో ఏమీ లేనప్పుడు ఇతరులకు ఏమి ఇస్తావు. సమ్‌థింగ్‌లోంచి ఏమైనా వస్తుంది కాని నథింగ్‌లోంచి ఏమీ రాదు. సర్వభూతాత్మా - నీ హృదయంలో ఏది ఉందో, ఎదుటివాడి హృదయంలో ఉన్నది కూడా అదే అని నీకు అర్థం అయినప్పుడు నువ్వు ఎవరినైనా ద్వేషించగలవా! నువ్వు ఇతరులకు అపకారం చేయగలవా? అంటే నువ్వు ఎదుటి మనిషిని ద్వేషిస్తున్నావు అంటే నిన్ను నువ్వే ద్వేషించుకుంటున్నావు. ఎదుటివాళ్ళకి నువ్వు అపకారం చేస్తున్నావంటే నీకు నువ్వే అపకారం చేసుకుంటున్నావు. ఎదుటివాళ్ళకి నువ్వు సహాయం చేస్తే, ఆ సహాయం నీకే తిరిగి వచ్చేస్తుందని నీ బ్రెయిన్‌కి అందుతూ ఉంటే నువ్వు సహాయ

సహకారములు అందించకుండా ఉండగలవా?

నువ్వు కర్తృత్వం లేకుండా, అహంభావన లేకుండా నువ్వు పరిశుద్ధుడవు అయి పని చేస్తే తామరాకు మీద ఉన్న నీరు ఆ తామరాకుని ఎలా అంటుకోదో అలాగే నువ్వు చేస్తున్న పని కూడా నిన్ను అంటుకోదు. లోకం రకరకాలుగా ఉంటుంది. నువ్వు ఏదైనా చెప్పకలిగేది ఉంటే చెప్పు, చెయ్యగలిగేది ఉంటే చెయ్యి కాని లోకాన్ని ఉద్రేకపరచకు, భయపెట్టకు. మీ మీద అసూయ ఉన్నవాళ్ళు అనేక రకాలు మాటలు అంటారు, మిమ్మల్ని భయపెడదామని చూస్తారు. మీరు కంగారు పడవద్దు, భయపడవద్దు. మీ కళ్ళతోటి మీరు చూచుకోండి కాని వాళ్ళ కళ్ళతోటి మిమ్మల్ని చూచుకోకండి. మీరు భయపడి మీ మైండుని పొల్యూట్ చెసుకోవద్దు. ఎవరైనా నిన్ను ఉద్రేకపరచటానికి ప్రయత్నం చేస్తే నువ్వు ఉద్రేకపడకు. నువ్వు ఎవ్వరికీ ఉద్రేకం కలిగించవద్దు. సీతమ్మ ఒకసారి ఉద్రేకపడి నీకు పురుషుడి లక్షణాలు లేవు నువ్వు పురుషుడి కింద కనిపిస్తున్నావు కాని నువ్వు స్త్రీవే అని రాముడిని అంది. అప్పుడు కూడా రాముడు ఉద్రేకపడలేదు. వాడు రాముడు. ఒకోసారి మనం జాగ్రత్తగా మాట్లాడదాం అనుకుంటాము కాని తొందర మాటలు మాట్లాడేస్తాము. అది కూడా నీ చేతిలో లేదు నీ స్వభావాన్ని బట్టి బయటకు వస్తాయి. నువ్వు వంద అంతస్థుల మేడ కట్టడం తేలిక కాని నీ స్వభావం మార్చుకోవటం చాలా కష్టం. నీ స్వభావం నిన్ను అంత తేలికగా విడిచిపెట్టదు అన్నాడు పరమాత్మ.

మీరు సాధన విడిచిపెట్టకండి, స్వాధ్యాయనం విడిచిపెట్టకండి, సత్‌పురుషులతోటి సహవాసం విడిచిపెట్టకండి. మీరు సత్‌పురుషులయొక్క సహవాసం చేయటం వలన వాళ్ళ వైబ్రేషన్స్ మీ బ్రెయిన్ మీద పని చేసి సహజంగా మీరు మారుమనస్సు పొందుతారు. అంటే తక్కువ పెట్టుబడితోటి ఎక్కువ లాభం పొందుతారు. మీ శరీరం ఉండగానే మీ మైండు చనిపోయి మళ్ళీ పుడుతుంది. అదే మారుమనస్సు. చాలా మందికి సత్‌పురుషుల సహవాసం చెయ్యాలని ఉండదు. ఒకవేళ సత్‌పురుషుల దగ్గరకి వెళ్ళినా వాళ్ళ వంటిమీద జర్రి పాకినట్టు ఉంటుంది. వాళ్ళ వాసనలు సత్‌పురుషుల సహవాసాన్ని యాక్సెప్ట్ చెయ్యనివ్వవు. అనపేక్షః, అపేక్షపడకు. కోరికలు తగ్గించుకో. నీకు మంచినీళ్ళు తాగాలని ఉంది అనుకో అది కోరిక కాదు. నీకు అన్నం తినాలని ఉంది అనుకో అది కోరిక కాదు. ధర్మంగా నువ్వు ఏదైనా ఎర్న్ చేసుకుంటున్నావు అనుకో అది కోరిక కాదు. దానిని నేచురల్ మైండు అంటారు. మీరు మనస్సులో శుచిగా ఉండాలి. శరీరం కూడా శుచిగా ఉండాలి. మీ బట్టలు శుచిగా ఉండాలి అంటే ఖరీదైన బట్టలు వేసుకోమనికాదు, నార్మల్‌గా బట్టలు ధరించినా అవి శుచిగా ఉండాలి. పాత్ర లోపల కడగాలి, బయటా కడగాలి అలాగే మనం లోపల శుచిగా ఉండాలి, బయటా శుచిగా ఉండాలి.

ఒక విష్ణుభక్తుడు ఏమి అన్నాడు అంటే ఓ నారాయణా నువ్వు ఉన్నావు, నేనూ

ఉన్నానని ఇంతకాలం అనుకున్నాను, కాని నిన్ను తెలుసుకున్నాక నాకు ఏమి తెలిసింది అంటే నువ్వు ఉన్నావు, నేను లేను అని తెలిసింది. అది పరమస్థితి. దానినే అమృతానుభవం అంటారు. అమృతానుభవం అంటే మీ శరీరం మరణించినప్పుడు కూడా నాకు మరణం లేదు అనే అనుభవం మీకు కలుగుతుంది. అందుచేత మీ శరీరం పోయినప్పుడు మీకు ఏమీ అనిపించదు. శరీరం పోయినప్పుడు అందరికీ దుఃఖం ఎందుకు వస్తుంది అంటే శరీరం పోయిన తరువాత నేను ఉండను అనుకుంటాడు. కాని వాడు ఉంటాడు. వాడు ఉంటాడని తెలియకపోవటం వలన వాడికి చావు అంటే దుఃఖం వస్తుంది. బ్రహ్మస్వరూపం అది సత్యముగా ఉంటుంది, జ్ఞానముగా ఉంటుంది, శాంతముగా ఉంటుంది, ఆనందముగా ఉంటుంది, అనంతముగా ఉంటుంది. దానికి పరిమితులు లేవు. అది పర్మినెంట్ హేపీనెస్. అది నీవై ఉన్నావు. నువ్వు అలాగ ఉండకు, ఇలాగ ఉండకు. నువ్వు అలా ఉన్నాను, ఇలా ఉన్నాను అనుకుంటే అప్పుడు నీ మైండు వచ్చి నిన్ను డిస్ట్రబ్ చేసేస్తుంది. నువ్వు నేచురల్ స్టేట్‌లో ఉండు, నార్మల్ స్టేట్‌లో ఉండు. ఆ నార్మల్ స్టేటు అనంతముగా ఉంటుంది, మొద్దుగా ఉండదు, జడముగా ఉండదు జ్ఞానముగా ఉంటుంది, చైతన్యముగా ఉంటుంది, దుఃఖముగా ఉండదు సుఖముగా ఉంటుంది. ఆ సుఖము అంటే వచ్చి వెళ్ళిపోయేది కాదు పర్మినెంటుగా ఉంటుంది. నీ శరీరం పోయినప్పటికీ శాంతి సముద్రంలో ఊగిసలాడతావు. ఆ బ్రాహ్మీస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి.

భగవంతుడు కొంతమందికి మంచి అవకాశాలు ఇస్తాడు, ఆ అవకాశాలు మీరు పాడుచేసుకోకండి. భగవంతుడు ఇచ్చిన అన్ని అవకాశాలను మీరు మేగ్జిమమ్ ఉపయోగించుకుని బ్రాహ్మీస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యండి. నువ్వు అన్నీ పొందుతావు అనుకో కాని బ్రాహ్మీస్థితి ఒకటే పొందలేవు అనుకో, నువ్వు ఎన్ని సంపాదించినా అది అంతా స్వప్న సమానం. నువ్వు స్వప్నంలో 100 కోట్లు సంపాదించినట్టు ఉంటుంది అనుకో, నువ్వు స్వప్నంలో ఆ వందకోట్లు ఎంజాయ్ చేస్తూ నేను రిచ్‌మేన్ అనుకుంటావు. నీకు మెలకువ వచ్చిన తరువాత ఆ వందకోట్లు అబద్ధం అనిపిస్తుంది. ఆ కల పొట్టిగా ఉంటుంది. ఈ జాగ్రదవస్థ కూడా స్వప్నమే. ఈ జాగ్రదావస్థ పొడుగ్గా ఉంటుంది. మనకి జ్ఞానం కలిగిన తరువాత ఈ జాగ్రదావస్థ కూడా అబద్ధం అని తెలుస్తుంది. నువ్వు బ్రాహ్మీస్థితి పొందలేవు అనుకో ఒక మహాసామ్రాజ్యానికి నువ్వు అధిపతి అయినా అది డ్రీమ్ స్టఫ్. అది ఒకటి లేని సున్నలతో సమానము. నీకు హేపీనెస్ కావాలి కానీ హేపీనెస్ కోసం నువ్వు భగవంతుడిమీద ఆధారపడిలేవు. నువ్వు విషయాలమీద ఆధారపడి ఉన్నావు. విషయాలలో హేపీనెస్ లేదు వాటిలో దుఃఖం ఉంది. అందుచేత నీకు చివరికి జీవితంలో మిగిలేది దుఃఖం. విషయాలు అనుభవిస్తావు. తరువాత ఏమిటి అంటే ముసలివాడవు అయిపోతావు. తరువాత ఏమి చేస్తావు. చస్తావు. ఈ పనులన్నీ చావటం కోసమేనా నువ్వు చేసేది. మేన్ ఈజ్ మోర్టల్. కాని నువ్వు ఇమ్మోర్టల్ స్టేట్ పొందటానికి ప్రయత్నం చెయ్యి అంటున్నాడు పరమాత్మ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జూలై | 4 | పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపం |
| జూలై | 15 | హైదరాబాద్ సత్యసాయి నిగమ్, శ్రీనగర్ కాలనీ (గురుపౌర్ణమి) |
| జూలై | 27 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# తమసోమా జ్యోతిర్గమయా!

ప్రతి సంవత్సరం మాదిరిగానే ది॥ 15-07-2011న బోధగురువు శ్రీ వ్యాసమహర్షి జన్మదినాన్ని గురుపూర్ణిమగా జరుపుకోబోతున్నాం. గురువంటే అమృతస్థితి, శాంతి, ఆనందం. మన ఆధ్యాత్మిక సాధనా మార్గంలో కల్పతరువైన గురువును ఆరోజున స్మరించుకొని, మన కృతజ్ఞతలు తెలుపుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. భగవాన్ శ్రీ రమణమహర్షి బోధించిన ఆత్మజ్ఞానాన్ని సరళంగా సూటిగా నేటి కాలానికి తగినట్లు మనకు అందిస్తూ, జనన, మరణ సంసార చక్రంలో కొట్టుకుపోతూ, దుఃఖము, అశాంతితో అలమటించే మానవాళికి శాశ్వతమైన స్వరూప అమృతస్థితిని తానుగా అనుభవైకవేద్యం చేసుకొనుటకు జ్ఞానవారధిగా నిలుస్తున్న భగవాన్ శ్రీరమణ మహర్షి ప్రియశిష్యులైన, సద్గురువు శ్రీ నాన్నగారికి మనము ఎంతో ఋణపడి ఉంటాము. అట్టి సద్గురువును మోహము నుండి విడిపించి, స్వరూప అమృతస్థితిలోకి మేల్కొలపమని ప్రార్థించాలి. సద్గురువు మనలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను అన్వేషింపజేసి అది నీవే! అని గ్రహింపజేసి, మన జీవితాలను జ్ఞానమయం చేస్తారు. అట్టి సద్గురువు పట్ల అపారమైన గురుభక్తి, శరణాగతి కలవారు ధన్యులు. స్వరూప సచ్చిదానంద అమృతస్థితిని 'తాను'గా అనుభవైకవేద్యం చేసుకొనుట కొరకు వచ్చిన ఈ మానవ దేహాన్ని, సదవకాశాలను లక్ష్యసాధనకై సద్వినియోగం చేసుకొని తరించాలి.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

నీ చేష్టలు, పనులు ఇతరులకు ఎట్టి హాని, అసౌకర్యం కలిగించకూడదు. ఇతరుల మంచి, ప్రశాంతత గురించి ఎక్కువ విలువనిచ్చి, తన గురించి తక్కువ ఆలోచించుకునే వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలో ముందున్నట్లు.

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

# గురువు చూపిన బాట - మరుమల్లె బాట

సాధకుడు ముక్తిని పొందాలంటే గురువే శరణ్యమని వేదాలు, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది పరమాత్ముని శాసనం. పరమాత్మ గురు రూపంలోనే దర్శనమిస్తాడు. ఏసు "నేనే మార్గాన్ని, నేనే జీవితాన్ని, నన్ను గూర్చి తెలిసినవారు నా తండ్రిని తెలిసినట్లే, నన్ను అనుసరించినవారు చీకటిలో పడరు" అన్నాడు. అందుకే గురుసేవ చేసి తరించాలి. గురువు మినహా మనకు ఎవ్వరూ తోడురారు. గురు కరుణలేనిదే దేనినీ సాధించలేము. గురుభక్తిలేని జీవితం - కుక్క, గాడిద జన్మలు లభిస్తాయి. అంటే ఛీత్కారాలు, సంసార బరువులను మొయ్యాలి అంతులేని వేదనతో. ఆధ్యాత్మిక మార్గంలో పయనించే వారికి సద్గురువును పొందాలనే తపన, ఆసక్తి అందరికీ ఉంటుంది. కాని దైవ నిర్ణయం గలవారు మాత్రమే వారిని చేరగలరు. గురు ప్రసాదం వల్లనే ఆయనను చూడగలము. గురువు మన ఆధ్యాత్మిక మార్గంలో మనకు చేదోడువాదోడుగా ఉంటారు. మనం ఆయన పట్ల భక్తి విశ్వాసాలు కలిగి ఉండాలి. ఆ మార్గంలో పయనించే వారికి జరిగే ఒడిదుడుకులను గూర్చి చెబుతారు. మన అనుమానాలు అన్నీ నశిస్తాయి. గురువు మీద నమ్మకంలేని వారు మదనపడతారు. మనకు ఇష్టమైన మార్గంలోకాక ఆయన మంచిదని చెప్పే మార్గంలో మనం నడవాలి, కార్యం జరగనివ్వాలి. గురువు మన కోర్కెలను తీర్చడు, మన అవసరాలను తీరుస్తాడు. గురు పాదాలకు నమస్కరించటం కాదు ఆయన జీవనశైలిని అలవర్చుకోవాలి. ఆయన్ని ప్రేమించటం ద్వారా మన భవరోగాలు అన్నీ నశిస్తాయి. ఆయన సహాయం అందుతుంది. హృదయమనే అద్దం పరిశుభ్రం కానంతకాలం సద్గురువు వచనాలు ఆశించిన ఫలితాలు ఇయ్యవు. నిజమైన ప్రేమ కలిగితే భక్తి విశ్వాసాలు ఏర్పడుతాయి. అప్పడు గురువు తనను ఏవిధంగా కాపాడుతున్నాడో తెలుసుకోగలడు. ఆయన సాంగత్యంలో కాలుడి ఆటలు సాగవు. ఆయన ప్రవచనంతో అహంకారం తగ్గి ప్రాపంచిక పాకులాటలు, బాధలు మనలను వేధించవు. గురువు శిష్యుని ఆధ్యాత్మిక ప్రగతికోసం పరీక్షలు, విమర్శలు చేసి శిష్యుని బలహీనతలను తొలగిస్తాడు. శిష్యుడు చేయని తప్పని కూడా గురువు అతన్ని నిందించవచ్చు అటువంటి పరీక్షలను నిశ్చలంగా భరించగలవారే పురోగమిస్తారు. గురుభక్తి, దైవభక్కి కన్నా గొప్పది. గురుభక్తి ఉన్నవారికి శాంతి సులభంగా లభ్యమౌతుంది. మనఃశాంతి తానుగా ఏర్పడుతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**